# వనదేవతలను దర్శించుకున్న 'నడిపెల్లి'





- గూడెం సత్యనారాయణ స్వామి కళ్యాణంలో ప్రత్యేక పూజలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల నియోజకవర్గ ప్రజలు ఆ యురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధి ల్లాల ని కోరుకుంటూ మాజీ ఎమ్మెల్యే నడి పెల్లి దివాకర్ రావు సకుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచిర్యా ల జిల్లా కేంద్రంలోని గోదావరి నది తీరం లో కొలు వుదీరిన సమ్మక్క-సారక్క వనదేవతలను దివాకర్ రావు, రాజకుమారి దంపతులతో పాటు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ దర్శించుకున్నారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుని నియోజకవర్గ క్షేమం కోసం ప్రార్థించారు. కార్య క్రమంలో పార్టీ నాయ కులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దండేపల్లి మండ లం గూడెం గ్రామంలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయాన్ని వారు సందర్శించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషా లతో ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో దండేపల్లి మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, నాయకులు రేణి శ్రీనివాస్, అక్కల రవీందర్, కానగంటి మధు, రమణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు



## హక్కులు ప్రతి ఒక్కరి పౌరుని బాధ్యత



**శెనార్తి మీడియా, బోథ్:**

పౌరులు తమ హక్కులను అవగాహనతో వినియోగించు కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రెవెన్యూ ఇన్స్పెక్టర్ సునీత అన్నారు. బోథ్ మండలం కరత్వాడ గ్రామ పంచాయతీలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా సర్పంచ్ దుర్వ విశ్వేశర్ రావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించగా, ఈ సందర్భంగా మాట్లాడిన సర్పంచ్ దేశ రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛలు కల్పించిందని పేర్కొన్నారు. జాతి, కులం, మతం, లింగం, పుట్టిన ప్రదేశం ఆధారంగా వివక్ష చూపకూడదని, చట్టం ముందు అందరూ సమానమే అన్న భావనతో జీవించడమే పౌరహక్కుల సారమని వివరించారు. అనంతరం ఆరోగ్యశాఖ సిబ్బంది కుష్ఠు రోగ నివారణ దినోత్సవం సందర్భంగా నివారణ చర్యలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ద్యాగాల గంగరాణి, పంచాయతీ కార్యదర్శి సమ్రిన్ సుల్తానా, రెవెన్యూ సిబ్బంది, ఏఎన్ఎం శశికళ, ఎంఎల్హెచ్పీ సాయి కృష్ణ, వార్డు సభ్యులు, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



**శెనార్తి మీడియా, బోథ్:**

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని, శబరి మాత ఆశీర్వా దాలు అందరిపై ఉండాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆడే గజేందర్ అన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బజార్ హత్నూర్ మండలం గిర్నూర్ గ్రామ శబరి మాత ఆశ్రమానికి మైక్ సెట్ అందించాలని ఆశ్రమ అధ్యక్షులు జక్కుల గంగయ్య యాదవ్ చేసిన విజ్ఞప్తికి ఆయన తక్షణమే స్పందించి మైక్ సెట్ అందజేశారని తెలిపారు. ఈ సహాయానికి ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గిర్నూర్ గ్రామ ఉపసర్పంచ్ గొల్లెన రాజేందర్, కాండ్లి సర్పంచ్ అనిత రాంకిషన్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆమల్లెపూల నారాయణ, దిలీప్, ఎస్టీ సెల్ అధ్యక్షులు జాధవ్ గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల అధికారులు సమయపాలన పాటించాలి




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో అధికారులు కచ్చితంగా సమయపాలన పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్ ఆదేశించారు. నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్తో కలిసి పరిశీలించిన ఆయన, నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిం చాలని సూచించారు. సాయంత్రం 5 గంటలకే గేట్లు మూసివేసి లోపల ఉన్న వారికి టోకెన్లు అందజేయాలని, రిటర్నింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండి వరుస క్రమంలో నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. అభ్యర్థులు హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తులు సరిచూసు కున్న తర్వాతే సమర్పించేలా చూడాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 1న అభ్యంతరాల స్వీకరణ, 2న పరిష్కారం, 3న ఉపసంహరణ అనంతరం తుది జాబితా విడుదల చేస్తామని, ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం నస్పూర్ కలెక్ట రేట్లో 08736-250501 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## వనదేవతల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి



- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి
- కేశవపట్నంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- జాతర ఏర్పాట్లపై హర్షం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేశవపట్నంలోని శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతరను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించారు. పార్టీ నాయకులతో కలిసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. వనదేవత లను భక్తితో కొలిస్తే కొంగుబంగారమై కాపాడుతారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. జాతర కమిటీ అధ్యక్షుడు గుర్రం స్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో పాటు ఎమ్మార్వో సురేఖ, ఎంపీడీవో కృష్ణప్రసాద్, సర్పంచ్ రాజేంద్రప్రసాద్, పార్టీ నాయకుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్లను ఘనంగా సన్మానించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అధికార యంత్రాంగం, జాతర కమిటీ చేసిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, ఆలయ కమిటీ సభ్యులు, మండల అధ్యక్షుడు గోపగొని బసవయ్య గౌడ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.



## అసిస్టెంట్ లోకోపైలట్ కు అభినందన

**శెనార్తిమీడియా, రామడుగు :**

రామడుగు మండలం వెలిచాలకు చెం దిన ఎముండ్ల రాజు రైల్వేలో అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగం సాధించినందుకు సర్పంచ్ వీర్ల నర్సింగరావు శుక్రవారం అభినందించారు. రాజు స్థానికంగా ఉన్న ప్రైవేట్ స్కూల్లో పదో తరగతి వరకు, హైదరాబాద్ లో డిప్లొమా, బీటెక్ పూర్తిచేసి గతేడాది రైల్వే ఉద్యోగానికి ఎగ్జా మ్ రాశాడు. ఇటీవలి ఫలితాల్లో రాజు అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రాజు ఉన్నతికి కృషిచే సిన తల్లిదండ్రులను జీపీ పాలకవర్గం శాలువాలతో సత్కరించారు. కార్యక్ర మంలో ఉప సర్పంచ్ ఎల్లమ్మల వసంత, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## యాసంగి పంటల నమోదు లేక రైతుల ఆందోళన



**శెనార్తి మీడియా, బోథ్:**

బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామా నికి చెందిన రైతులు యాసంగి సీజన్లో సాగు చేసిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు నమోదు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాసంగిలో రైతులు మొక్కజొన్న, తెల్లజొన్న, నువ్వు లు తదితర పంటలు సాగు చేస్తున్నా వాటి వివరాలు ఇప్పటికీ నమోదు కాలేద ని ఆయన తెలిపారు. పంటల నమోదు లేకపోవడంతో రైతులు తమ పంటలను మార్కెట్లో అమ్ముకునే సమయంలో సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత యాసంగి (రబి) సీజన్ లో సాగు చేసిన పంటలను నమోదు చేయకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం పంటల కొనుగోలు చేస్తుందా లేదా అనే అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయని బొర్రన్న వెల్లడించారు. రైతు భరోసా నిధులు కూడా ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో రైతులు అగమ్యగోచర పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. ఇదే సమయంలో పంటల బీమా పథకం అమలు కాకపోవడం వల్ల రైతులు నానా అవస్థలు పడుతున్నారని వివరించారు. సాగు చేసిన పంటలను క్రాప్ బుకింగ్లో వెంటనే నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ డిమాండ్కు మద్దతుగా బి రాజు, గణేష్, డి స్వామి తదితర రైతులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

## మహిళలు చదువులో, ఆటల్లో రాణించాలి



**శెనార్తి మీడియా, బోథ్:**

మహిళలు చదువు, క్రీడలు, సంస్కృతి సహా ప్రతి రంగంలో రాణించాలని బోథ్ సర్పంచ్ కుర్మె అన్నపూర్ణ మహేందర్ అన్నారు. 2026 సంవత్సరానికి గాను ఆదిలాబాద్ జిల్లా స్థాయి బాలికల క్రీడా సాంస్కృతికోత్సవాలను బోథ్ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు)లో విజ యవంతంగా నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమానికి రూ.25 లక్షల బడ్జెట్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, అదలూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఈ ఉత్సవాలు బోథ్కు రావడంలో కీలక పాత్ర పోషించిన కాన్స్టిట్యుయెన్సీ ఇన్చార్జ్ ఆడె గజేందర్కు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవంతో విద్య ప్రాధాన్యత తెలుసుకున్నానని, సర్పంచ్గా బాధ్యతలు చేపట్టిన తర్వాత బోథ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకు రూ.40 లక్షలతో కాంపౌండ్ గోడలు, రూ.12 లక్షలతో వంటశాలల నిర్మాణం చేపట్టామని వెల్ల డించారు. జిల్లా స్థాయి బాలికల క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలకు భారీ నిధులు కేటాయించడం ద్వారా విద్య, క్రీడలు, సంస్కృతి రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవు తుందని ఆమె తెలిపారు

## మంచిర్యాల జిల్లా కోర్టులో బార్ కౌన్సిల్ ఎన్నికలు




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంచిర్యాల జిల్లా కోర్టులో శుక్రవారం పోలింగ్ ప్రారంభమైంది. సివిల్ జడ్జి అనూష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షుడు భుజంగరావు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పోలింగ్లో జిల్లావ్యాప్తంగా 376 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 స్థానాల కోసం 203 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, మొత్తం 30,700 మంది న్యాయవాదులు ఓటు వేయనున్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని, ప్రాధాన్యత క్రమంలో గరిష్ఠంగా 23 మంది అభ్యర్థులకు ఓటు వేయవచ్చని, కనీసం 5 ప్రాధాన్యతలు తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి హైదరాబాద్లోని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యాలయానికి తరలించనున్నట్లు, ఫిబ్రవరి 10న ఓట్ల లెక్కింపు చేపడతామని అధికారులు వెల్లడించారు.



# మున్సిపల్ కార్పొరేషన్ అభ్యర్థుల జాబితా విడుదల



- 60 డివిజన్ల పేర్లను ప్రకటించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు
- రెండేళ్ల అభివృద్ధి పనులే గెలిపిస్తాయని ధీమా

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** మంచిర్యాల మున్సిపల్ కా ర్పొ రేషన్ ఎన్నికల బరిలో నిలిచే కాంగ్రెస్ అభ్యర్థుల జాబి తా ను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శుక్రవారం విడు దల చేశారు. స్థానిక పాత్రికేయుల సమావేశంలో మొత్తం 60 డివి జన్ల అభ్యర్థుల పేర్లను ప్రకటించిన ఆయన, ప్రతి డివి జ న్‌లో ఓట్ల శాతం పెంచేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరా రు. రెండేళ్లుగా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

**వైద్యం, ఉపాధిపై ప్రత్యేక దృష్టి..**

మంచిర్యాల కార్పొరేషన్ ను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని, తద్వారా పౌర సేవలు మరింత మెరుగుపడతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు తీసుకువస్తానని భరోసా ఇచ్చారు. మంచిర్యాలలో 2 వేల పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయడం తన ప్రధాన లక్ష్యమని, దీనివల్ల విద్య, వైద్యం కోసం ప్రజలు ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని వివరించారు. అలాగే, గుడిపేటలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద జాతీయ స్థాయి చేప పిల్లల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి పుస్తకంలో మొదటి పేజీలోనే లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి ఫోటో వేయడం మన ప్రాంత అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కార్పొరేటర్ అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** జిల్లాలో జరగనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్ కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో శుక్రవారం ఈ ప్రక్రియను పర్యవేక్షించిన ఆయన, ఎన్నికల నిర్వహణకు అవసరమైన పీఓలు, ఏపీఓలు, ఓపీఓల ఎంపిక పూర్తయిందని చెప్పారు. మున్సిపాలిటీల వారీగా పోలింగ్ సిబ్బందిని కేటాయించామని, విధులకు ఎంపికైన సిబ్బందికి త్వరలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనల ప్రకారం సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించిన ఆయన, అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని 20 శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా విజేతలకు బహుమతులు



**సిద్దిపేట, జనవరి 30 :** రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పోలీస్ నిర్వహించిన సోషల్ మీడియా వీడియోల పోటీ విజేతలను శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ప్రకటించారు. కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేయడంతో పాటు, పోటీలో పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. పోటీలో గెలుపొందిన మొదటి విడత మన సిద్దిపేట అడ్డా ఇన్స్టాగ్రామ్ పేజ్ , రెండో విడత ఫ్లాష్ ఫ్రేమ్35 విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాల ద్వారా ఒక సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని, ముఖ్యంగా యువతను రోడ్డు భద్రతా నియమాలపై చైతన్యపరచడంలో ఈ వీడియోలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కేవలం జరిమానాలు మాత్రమే పరిష్కారం కాదని, ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ పట్ల అవగాహన ఉండాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన కల్పించేందుకు యువత మరింత ఉత్సాహంగా ముందుకు రావాలని కమిషనర్ కోరారు. సమాజ హితం కోసం యువత తమ సృజనాత్మకతను ఉపయోగించడం శుభపరిణామమని అభినందించారు. నేటి కాలంలో షార్ట్ వీడియోలకు ఉన్న క్రేజ్‌ను గమనించి, వాటిని కేవలం వినోదానికే కాకుండా.. ప్రజల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి ఒక సాధనంగా మలుచుకోవాలని యువతకు సూచించారు. కేవలం రోడ్డు భద్రతకే పరిమితం కాకుండా, మాదక ద్రవ్యాల నిర్మూలన , మద్యపాన వ్యసనం వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలు మరియు సమాజానికి పోలీస్ సేవలు వంటి అంశాలపై కూడా వినూత్నమైన వీడియోలు రూపొందించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, ఇన్స్పెక్టర్లు వాసుదేవరావు, ఉపేందర్, శ్రీధర్ గౌడ్, లక్ష్మీ బాబు, సబ్ ఇన్స్పెక్టర్ దామోదర్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ సాయి ప్రసాద్ సాయి చరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రారంభమైన గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర

- మూడు రోజుల పాటు ఆదివాసీల ఆరాధ్య దైవానికి పూజలు
- 101 కుండలతో గంగమ్మ జలాల ఊరేగింపు
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



మంచిర్యాల జిల్లాలో ఆదివాసీ నాయకపోడ్‌ల ఆరాధ్య దైవం గాంధారి ఖిల్లా మైసమ్మ మహా జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. జిల్లాలో సమ్మక్క-సారక్క, నాగోబా జాతరల తర్వాత అతిపెద్దదిగా గుర్తింపు పొందిన ఈ జాతర మందమర్రి మండలం బొక్కలగుట్ట సమీపంలోని ఖిల్లాపై మూడు రోజుల పాటు జరగనుంది. శుక్రవారం ప్రారంభమైన పూజలు శని, ఆదివారాల్లో కొనసాగుతాయి.

**నేడు జలాల శుద్ధి.. రాత్రికి పూజలు..**

నాయకపోడు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పెద్ది వంశీయులు సదర్ల భీమన్న వద్ద నుంచి గజాలను కాలినడకన మంచిర్యాల గోదావరికి తీసుకెళ్లి శుద్ధి చేసి మొక్కులు చెల్లించారు. శనివారం గోదావరి నుంచి తీసుకువచ్చిన గంగమ్మ జలాలతో 101 మంది మహిళలు 101 కుండలతో ఊరేగింపుగా వెళ్లి మైసమ్మను శుద్ధి చేస్తారు. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గిరిజన సాంప్రదాయ ఆటపాటలు కొనసాగుతాయి. అర్ధరాత్రి 12 గంటల నుంచి పెద్ది వంశీయుల ప్రత్యేక పూజలు మొదలై సూర్యోదయం వరకు సాగుతాయి.

**భక్తుల కోసం భారీ ఏర్పాట్లు..**

తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి పక్క రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (టీటీడీఓ) రమాదేవి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వసతి, విద్యుత్ సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి దర్బార్ సందర్శన ఉంటుందని, భక్తులు మొక్కులు చెల్లించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకపోడు సేవా సమితి ప్రతినిధులు, గిరిజన తెగల నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- నోడల్, స్పెషల్ ఆఫీసర్లు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలి
- జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు

**జగిత్యాల, జనవరి 30 :**




మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు, ప్రత్యేక అధికారులు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎక్స్పెండీచర్ అబ్జర్వర్ డి. శ్రీనివాస్ తో కలిసి రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై జిల్లా నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ఎలాంటి పొరపాట్లు జరగకుండా సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పని చేసి స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, గుర్తుల కేటాయింపు వంటి ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరగాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన, అవసరమైన సౌకర్యాల కల్పనపై క్షేత్ర స్థాయిలో సమీక్షలు నిర్వహించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, జిల్లా నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



మంథని, జనవరి 30: గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని లోని ఆర్డిఓ కార్యాలయంలో 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి కు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, ఈఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చర్యలు
- క్షేత్ర స్థాయి పర్యవేక్షణ మరింత పెంచాలి: జాతీయ ఎస్సీ



కరీంనగర్, జనవరి 30 : జిల్లాలో ఎస్సీ వర్గాల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడే లా సమగ్ర చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి గూడె శ్రీనివాస్ ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కరీంనగర్‌కు వచ్చిన ఆయన ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్‌తో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ వర్గాల సంక్షేమానికి అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. ఎస్సీలపై జరుగుతున్న వివక్ష, అణచివేత ఘటనలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే అధికారులు స్పందించాలని ఆయన సూచించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో వేగవంతమైన విచారణ చేపట్టి బాధితులకు తక్షణ సహాయం అందేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామ స్థాయి వరకు సంక్షేమ పథకాలు అర్హులైన అందేలా చర్యలు తీసుకోవాల ని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత పెంచాలని సూచించారు. ఎస్సీ వర్గాల విద్యా ప్రగతి, ఆర్థిక సాధికారత, జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న విద్య, ఉపాధి, గృహనిర్మాణం, ఆరోగ్యం, సామాజిక భద్రత పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్కాలర్‌షిప్‌ల పంపిణీ, హాస్టళ్ల వసతులు, స్వయం ఉపాధి యూనిట్లు, ఆర్థిక సహాయం, భూ సమస్యలపై ప్రత్యేకంగా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జిల్లాలో ఎస్సీ–ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అట్రాసిటీ కేసులపై తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ విచారణ వేగవంతం అయ్యేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎస్సీ–ఎస్టీల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి గూడె శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, ఆర్డీవో కె మహేశ్వర్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎస్సీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు నాగైలేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అనిల్ ప్రకాష్, ఏసీపీ వెంకటస్వామి సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.